# నిరీక్షణ

కోట భగవద్గీతశాస్త్రి

''జయ జయ జయ ప్రియభారత
జనయిత్రీ దివ్యధాత్రి!
జయ జయ జయ శత సహస్ర
నరనారీ హృదయనేత్రి''

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి గేయాన్ని అక్కడి విద్యార్థులు ముక్తకంఠంతో ఆలపిస్తున్నారు. తరువాతి చరణం అందుకున్నాడు తెలుగు మాష్టారు రాఘవయ్య పంతులు.

విశాఖపట్నం దగ్గరలోని ఓ పల్లెటూరది. సస్యశ్యామలమైనది, పట్నానికి కావలసిన పాలు, పెరుగు పంటి నిత్యావసరాలు విరివిగా దొరుకుతాయి, పంటలు కూడా బాగా పండుతాయి. అందుకే అక్కడ నివసించే వారిని సంపన్న రైతులుగా చెప్పుకోవచ్చు.

అక్కడ జిల్లా పరిషత్ పాఠశాల ఉంది. ఘనంగా పాఠశాల బోర్డు మాత్రం కనిపిస్తుంది. స్కూల్ ఎలా ఉంటుందో చూద్దామనుకున్నవారికి, అక్కడి చెట్ల క్రింద పిల్లలకు పాఠాలు చెప్పే దృశ్యం కనబడటం పరిపాటి.

గేయం పాడించిన రాఘవయ్య పంతులు, జారిన కళ్ళద్దాలను పైకి తోసుకుంటూ, అయిదవ తరగతి తెలుగు పుస్తకం చేతిలోకి తీసుకుని పాఠం ప్రారంభించాడు. 'పల్లెల్లోమార్పు' అనే పాఠం అది. ఆసక్తిగా వింటున్నారు పిల్లలు. ఇంతలో ఆకాశంలో ''భోయ్..'' మంటూ శబ్దం.

అప్పటివరకూ పాఠాన్ని శ్రద్ధగా వింటున్న పిల్లలంతా ఒకేసారి తలలు ఆకాశానికేసి తిప్పారు. 'బోయ్' మంటూ పైన విమానమొకటి వెళ్తోంది. ''అరరె.. పైన విమానంరా చూడండి'', అంటూ మాష్టారు కూడా పైకి చూడసాగారు. దగ్గరికి వచ్చేప్పటికి ఇంకా స్పష్టంగా కన్పించింది. పిల్లలంతా సంతోషంగా కేరింతలు కొడుతున్నారు. అడప దడపా విమానం అటు వెళ్ళటం, వాళ్ళు చూడటం, అలవాటే అయినా ఎప్పుడూ వాళ్ళకు వింతగానే ఉంటుంది. పిల్లలు అందరూ లేచి విమానం వచ్చేదిశగా పరుగెత్తారు.

''ఒరేయ్! దాని తోక.. సూడంర్రోయ్ ఎర్రంగుంది'' అన్నాడు ఒక పిల్లవాడు.

''దానికి.. మరి..మరి.. చెక్కరాలు లేవే'' అనుమానం వచ్చింది మరొకడికి.

''దానిలోపల్నా.. ఎట్లగుంటుందో''

''బసు మల్లె.. గుంటాదంట.. మీక్కెలియదా'' అక్కడున్న పిల్లలంతా తలా ఒక మాట, ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు. అందులో ఒక పిల్లవాడు మాత్రం దూరంగా నిలబడి దానివైపే నిశితంగా చూస్తున్నాడు.

''మీ దుంపతెగ.. రండర్రా పాఠంమీద శ్రద్ధవుండదు, బడుద్దాయిలికి'' మాష్టారు పిలిచారు.

అయినా వినపడనట్లే దూరంగా వెళ్ళిపోయిన విమానాన్నే చూస్తున్నారు వాళ్ళంతా. అక్కడ నిలబడ్డ పిల్లవాడు మాత్రం నెమ్మదిగా రాఘవయ్య దగ్గరకు వెళ్ళి నుంచున్నాడు.

''ఏరా.. నువ్వొక్కడివే వచ్చావు. వాళ్ళనుకూడ రమ్మను.'' చెప్పాడు రాఘవయ్య.

''మాష్టారండీ, మాష్టారండీ, మరేమో.. అది.. ఆకాశంలో, నడుత్తాదిగంద పడిపోదా'' అనుమానంగా అడిగాడు ఆ పిల్లాడు.

పిల్లాడి ప్రశ్నకి రాఘవయ్య జారుతున్న కళ్ళద్దాల్ని సవరించుకుంటూ ఎవరా అని చూశాడు. ''అరె నువ్వట్రా.. ఏంటీ.. విమానమేనా అది పడిపోదురా.. దాన్ని నడిపేవాడు మళ్ళా కిందికి దింపేవరకూ అది గాల్లో అట్లా పోతూనే ఉంటది.'' ఏమి చెప్పాలో తెలియక ఆ సమాధానం ఇచ్చాడు రాఘవయ్య.

''మరి.. మరి.. దాన్లోకెక్కాలంటే.. ఏం చెయ్యాలండీ.. బోలెడన్ని డబ్బులు కావాల్నా'' మళ్ళీ అడిగాడు ఆ పిల్లవాడు.

''ఏరా అన్ని ఆరాలు తీస్తున్నావు.. [illegible]వేంటి. అదెక్కాలంటే డబ్బులు ఉంటే చాలదు బాగా చదివేడవాలి. ఏ డాక్టరో, ఇంజనీరో అవ్వాలి'' సమాధానమిచ్చాడు రాఘవయ్య.

''ఏరా.. వేణు.. విమానం ఎక్కాలని.. [illegible]దేటి, ఆ.. మరి మంచిగా చదువు.''

మంచిగా చదివితే విమానం ఎక్కుతారన్నమాట వేణు హృదయంలో నాటుకుంది రాఘవయ్య మాట.

చదువుకుంటే 'ఆశ' తీరుతుందన్నమాట. వేణు హృదయంలో ఆశ చిగురించింది. అప్పుడప్పుడే అది మహావృక్షంగా మారింది.

''ఏరా.. ఉలకవ్, పలకవ్..''

రాఘవయ్య మాటలకు ఈలోకంలోకి వచ్చాడు వేణు.

''అవును, మాష్టారూ.. నేను.. మంచిగా చదువుకుంటాను.

''ఆ.. ఏడ్చినట్టేవుంది. ఇయ్యాలో.. రేపో.. మీ అయ్య నిన్ను పొలంలో వెయ్యాలనుకుంటున్నాడు నువ్వేమో చదువుకుంటావా?''

''లేదండీ.. నేను చదువుకుంటాను. మా అయ్యకి అమ్మకి మీరే చెప్పండి మాష్టారూ'' ప్రాధేయపూర్వకంగా అన్నాడు వేణు.

ఇంతలో విమానం వెళ్ళిపోయిందని పిల్లలందరూ వచ్చి కూర్చున్నారు.

''సర్లే.. రేపు మీ అయ్యకి చెప్పు వచ్చి నాతో మాట్టాడమని'' అంటూ క్రింద పెట్టిన కళ్ళద్దాలు తీసుకుని పెట్టుకుంటూ, పాఠం చెప్పటానికి పుస్తకం తెరిచాడు.

• • •

''సుబ్బయ్యా, బడిలో పిల్లలందరికంటే మీవాడు వేణు బాగ చదువుతాడు. అయినా మీకేమి తక్కువ. పాడి, పొలం, పాలేర్లు. వాడు బాగ చదువుకుంటానంటే పొలంపని నేర్పుతానంటావు'' రాఘవయ్య వేణు తండ్రితో అన్నాడు.

''అదేంటి.. మాష్టారూ.. మాకు సదువులెందుకండీ.. పొలం పనులమీద బతికేటోళ్ళకి, పొలం లెక్కలికి పనికొచ్చే సదువు సదువుకున్నాడు. ఇంకెందుకండీ.''

''భలేవాడివిరా.. పదిమందిని కన్నావా? ఒక్కడే కొడుకుని బాగా చదివించుకోరా అంటే.. ససేమిరా అంటావు...'' మందలిస్తున్నట్లుగా అన్నాడు రాఘవయ్య.

''అయ్యా... అయ్యా.. నేను చదువుకుంటా. పొలంలోకి పోను'' మారం చేస్తున్నాడు వేణు.

''సరే మాష్టారూ.. బాగా సదువుకుంటేనే, సద

విస్తా, తప్పితే పొలానికి పంపుతా'' ఒక వొప్పందానికి వచ్చినట్లు చెప్పాడు సుబ్బయ్య.

''ఏరా.. వేణు.. విన్నావా మీ అయ్య మాట. బాగా చదువుకుంటేనే చదివిస్తాడు లేకుంటే పొలంపన్లే'' హెచ్చరించాడు రాఘవయ్య.

''అట్టాగే మాష్టారు. చదువుకుంటాను.''

• • •

''నాన్న, నాన్న..''

''ఏందిరా అయ్యా...''

''నాన్న, మొన్న నేను ఫోన్‌లో చేసిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాను'' సంతోషంగా చెప్పాడు వేణు.

అర్థంకానట్టు చూసాడు సుబ్బయ్య.

''అదే నాన్న నాకు ఉద్యోగం వచ్చింది. వచ్చి చేరమని ఉత్తరం పంపించారు. నాన్న ఢిల్లీ వెళ్ళేందుకు విమానం టిక్కెట్టు కూడా పంపారు.'' సంతోషం పట్టలేక అరిచినంత పనిచేశాడు వేణు.

''పోన్లే అయ్యా.. నువ్వు పడ్డ కష్టం తీరింది.'' అంది తల్లి మీనాక్షి.

''అమ్మా! మాష్టారికి చెప్పి వస్తాను'' అంటూనే బయటకు పరుగు పెట్టాడు వేణు.

• • •

''వేణు, మొత్తానికి నీ పంతం నెగ్గించుకున్నావురా! పల్లెటూర్లో పుట్టి, ఎలక్ట్రానిక్ ఇంజనీర్ అయ్యావు. నీకు చదువు చెప్పిన పంతులుగా నేను గర్వపడుతున్నానురా'' అంటూ మడత కుర్చీలోంచి లేచి వేణూని ఆశీర్వదించాడు రాఘవయ్య.

''వస్తాను మాస్టారూ.. ఎల్లుండే ప్రయాణం. కావల్సినవన్నీ చూసుకోవాలి.''

''ఏరా! మీ అమ్మను, నాన్నను తీసుకెళ్ళవా.''

''వెళ్ళేది ఇప్పుడేకదా మాష్టారు. మరల వచ్చినప్పుడు తీసుకువెళతాను. అయినా నేను లేకుండా వాళ్ళు ఉండలేరు మాష్టారు...''

''అవున్రా వాళ్ళు నీమీదే ప్రాణం పెట్టుకున్నార్రా. ఇంకెవరున్నారు ఒక్కకొడుకువి కదా.''

''అవును మాష్టారూ.. మీమాట కాదనలేక నాకు చదువు చెప్పించారుగాని లేకుంటే వ్యవసాయం చేస్తే వాళ్ళ కళ్ళముందే ఉంటానని వాళ్ళ ఆశ. ఇప్పుడు మాత్రం ఏమైంది మాష్టారూ... నాతోనే ఉంటారు'' అంటూ వేణు రాఘవయ్య దగ్గర శెలవు తీసుకున్నాడు.

తల్లి, తండ్రి దగ్గర ఆశీర్వాదం తీసుకుని వైజాగ్ బస్సెక్కాడు వేణు. ఎన్ని సంవత్సరాల 'నిరీక్షణ' ఈ విమాన ప్రయాణం. వేణూకి చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఊహే ఇంత మధురంగా ఉంది. వాస్తవం ఎంత అద్భుతంగా ఉంటుందో, ఆలోచనతోనే వైజాగ్ చేరాడు వేణు.

అక్కడ నుండి టాక్సీలో ఎయిర్‌పోర్ట్‌కు చేరాడు. లగేజి తీసుకుని టాక్సీకి డబ్బు ఇచ్చేసి, లోపలికి అడుగుపెట్టాడు. తన కోరిక కొద్దిక్షణాల్లో తీరబోతుంది. ఇన్ని సంవత్సరాల కలలన్నీ రాశి పోసినట్లుగా ఉంది వేణూకి. నిమిషాల్ని యుగాలుగా గడుపుతున్నాడు.


టైం చూసుకున్నాడు. ఇంకా గంట టైంవుంది. కౌంటర్‌లో టిక్కెట్ ఇచ్చాడు. కంప్యూటర్ చెకింగ్ అయ్యింది. బోర్డింగ్ పాస్ తీసుకుని వెళ్ళి లాంజ్‌లో కూర్చున్నాడు. సామాను సెక్యూరిటీ చెకింగ్‌కి అప్పజెప్పాడు.

రన్‌వే మీద అప్పుడే దిగిన విమానం ఒకటే రెక్కలు చాచిన గ్రద్దలా కనిపించింది. పరిశీలనగా దాన్నే చూస్తున్నాడు. తలుపులు తెరుచుకున్నాయి ప్రయాణీకులు దిగేందుకు ఎస్కులేటరు వచ్చింది.

ఎనౌన్సింగ్ వినిపిస్తుంది. ''ఢిల్లీ వెళ్ళే విమానం సిద్ధంగా ఉంది.'' టైమ్ చూసుకున్నాడు. పదిహేను నిమిషాలు ఉంది. ఢిల్లీ వెళ్ళే ప్రయాణికులు విమానంవైపు కదిలారు. ఉద్వేగంతో లేచాడు వేణు, ముందుకి కదిలాడు.

మెట్లపై నుండి విమానంలోకి అడుగుపెట్టాడు. 'స్వప్నసౌధం' కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. హృదయం లయ పెరిగింది. ఎయిర్‌హోస్టెస్ వెల్‌కం చెప్పుంది. అదేమీ పట్టించుకోవట్లేదు వేణు. వెళ్ళి తన సీటు నెంబరు చూసుకున్నాడు. కరెక్ట్‌గా కిటికీ ప్రక్కనే వచ్చింది. 'థాంక్ గాడ్' అనుకున్నాడు. సీటులో





## మా ఆవిడొచ్చింది

''నిన్న జాతరలో నీ ప్రియురాలితో కలిసి రంగులరాట్నం తిరుగుతున్న నువ్వు 'ఎంతడబ్బైనా ఇస్తానుగాని రంగులరాట్నం మాత్రం ఆపొద్దు' అన్నావట. ఎందుకని?''

''రంగులరాట్నం ఎక్కడానికి పిల్లలతో మా ఆవిడొచ్చింది మరి!''

## బట్టలషాపు

''నిన్నెవర్నో 'స్కౌండ్రల్' అని తిట్టిపోసిందానివి ఈరోజేమో అతన్ని ప్రేమిస్తున్నానంటున్నావేంటి?'' అడిగింది లత.

''అతన్కి బట్టలషాపుందని ఈరోజే తెల్సింది మరి!'' చెప్పింది సుశీల.

## దూరంగా

''మీ భార్యభర్తలిద్దరూ సినిమాకెళ్తూ మీ పిల్లలకు తోటపని అప్పజెప్తే పూలమొక్కల్ని పీకేశారంటున్నావేంటి?''

''మొక్కల్ని కలుపు మొక్కల్కి దూరంగా వుండేట్లు చూడమన్నామరి!''

## రౌడీ మామూలు

''నిన్న బజార్లో మీఆవిడ ఎవడ్నో చాచిపెట్టి కొడ్తే దిమ్మతిరిగి పడిపోయాడట! ఎవరతను?''

''మా ఆవిడ సంగతి తెలియని ప్రక్కవీధి రౌడీ మా ఆవిడ్ని రౌడీ మామూలడిగాడంట మరి!''

**- తమ్మిశెట్టి భుజంగరావు (పాలకొల్లు)**

కూర్చున్న వేణూకి ఇండియా ప్రైమినిష్టర్ అయినట్లు ఉంది. టైం అయ్యింది.

ఎస్కులేటర్ జరిగిపోయింది తలుపులు మూసుకున్నాయి. ప్రయాణీకులకు ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది. బెల్టు బిగించుకోమని, సర్వ్ చేసిన కాటన్ ఉపయోగించుకోమని, బ్రీతింగ్ ప్రాబ్లమ్ ఉంటే ఆక్సిజన్ ట్యూబ్స్ వాడండని.

ఇంజన్ స్టార్ట్ అయ్యింది. క్షణక్షణానికి వేగం పెరుగుతుంది. ఎయిర్ హోస్టెస్ కాటన్, చాక్‌లెట్స్ ఆఫర్ చేసింది. 'నో థాంక్స్' చెప్పాడు వేణు. అప్పుడే పాకటం నేర్చుకున్న పాపాయిలా కదిలింది విమానం. క్షణంలో అది పిటి ఉష పరుగులా మారింది. రన్‌వే చివరి వరకూ వచ్చి గాల్లోకి లేచింది.

ఆ పొజిషన్ మాష్టారు పడుకునే వాలుకుర్చీలా ఉంది వేణూకి. రన్‌వే నుంచి గాల్లోకి వెళ్ళేటప్పుడు భయంకరమైన శబ్దం. చాలా థ్రిల్‌గా ఉంది వేణూకి. ఆసక్తిగా కిందికి చూస్తున్నాడు. క్షణక్షణానికి ఎత్తు పెరుగుతూ, మేఘాలను చేరుతుంది. క్రిందికి చూసాడు వేణు. తన ఊరు కనిపిస్తుంది క్రింద. చిన్న చిన్న బొమ్మరిల్లులా ఉన్నాయి ఇళ్ళు. సముద్రం ఒడ్డు స్విమ్మింగ్‌పూల్‌లా కన్పిస్తుంది.

మేఘాలలోకి చేరిన విమానం నుండి క్రింది ఉన్నవేమీ కనిపించటంలేదు. పౌరాణిక సినిమాల్లో నారదుడు నడిచే మేఘాల్లా, విమానం మేఘాలలో నిశ్చలంగా ఉన్నట్లనిపించింది. విమానం ఎంత ఎత్తుకు వెళ్ళింది స్పీకర్‌లో వినిపిస్తుంది.

ముప్పైవేల అడుగుల ఎత్తులో ఉన్నానా. అయ్యో! ఇక్కడ నుండి పడితే.. ఒక్కసారి భయంవేసింది వేణూకి. తన ఊహకి తనకే నవ్వొచ్చింది. ఎయిర్ హోస్టెస్ భోజనం సప్లై చేస్తుంది. తీసుకున్నాడు. అందరూ భోజనం చేసే పనిలో వున్నారు. వేణు మాత్రం రెప్పవెయ్యకుండా క్రిందికి చూస్తున్నాడు. మీల్స్ ప్యాకెట్స్ ప్రక్కకి పెట్టాడు. టైం చూసుకున్నాడు. ఇంకొద్ది నిమిషాల్లో ఢిల్లీలో ఉంటాడు. అప్పుడే టైం అయిపోయిందా! ఇంకొక గంటైనా విమానం దిగకుంటే బావుణ్ణు అనిపించింది వేణూకి. విమానం ఢిల్లీకి సమీపిస్తుంది. క్రిందకి దిగుతుంది. మేఘాల నుండి బయటపడింది. ఇప్పుడు క్రింద వున్నవి స్పష్టంగా కన్పిస్తున్నాయి. తాజ్‌మహల్, రెడ్ ఫోర్ట్.. స్పీకర్‌లో ఎనౌన్స్‌మెంట్ వస్తుంది. మరలా బెల్ట్ బిగించుకోమని.

'ధన్‌న్‌న్..' విమానం చక్రాలు నేలకు ఆనినట్లు చప్పుడూ, కుదుపూ, క్రిందికి దిగిన విమానం రన్‌వే మీద పరిగెత్తుతుంది. 'వెల్‌కమ్ టు ఢిల్లీ.' 'థాంక్యూ' హోస్టెస్ గొంతు శ్రావ్యంగా స్పీకర్‌లో వినిపిస్తుంది. ఆగిన విమానానికి దిగేందుకు ఎస్కులేటర్ జాయిన్ చేస్తున్నారు. తలుపులు తెరుచుకున్నాయి.

వేణు అనుకున్నంతసేపు పట్టలేదు ఢిల్లీ ప్రయాణం. సంవత్సరాల నిరీక్షణ క్షణాల్లో జరిగిపోయింది. నిట్టూరుస్తూ లేచాడు వేణు. తలుపుదగ్గర హోస్టెస్ 'థాంక్యూ', 'నమస్తే' చెప్తుంది. క్రిందికి దిగిన వేణు క్షణంసేపు విమానాన్ని చూశాడు. 'ఇదేనా ఇప్పటివరకు గాలిలో ఉంది' అనిపించింది.

సామానుకోసం లగేజి క్యాబిన్‌కు నడిచాడు. సామానుతో బయటపడ్డాడు. బయట కంపెనీ తరపున తన కోసం 'వెల్‌కమ్' బోర్డుతో వున్నాడు ఒక వ్యక్తి. 'మిస్టర్ వేణు, వెల్‌కమ్ టు ఢిల్లీ' '...కంపెనీ'.

దగ్గరకు వెళ్ళి తనను పరిచయం చేసుకున్నాడు. ''ఐ యామ్ వేణు ఫ్రమ్ వైజాగ్.''

''వెల్ కమ్ టు యు, గ్లాడ్ టు మీట్ యు. ప్లీజ్ కమ్ సార్'' కారు దగ్గరకు నడిచాడా వ్యక్తి. అతన్ని అనుసరించాడు వేణు. సామాన్ని తీసుకుని వెనకనే డ్రైవర్ వచ్చాడు. కారు ముందుకి కదిలింది. ఢిల్లీ వీధుల్ని పరిశీలిస్తూ కూర్చున్నాడు వేణు.

• • •

సుబ్బయ్య, మీనాక్షి కూడా విమానంలోనే ఢిల్లీ వచ్చారు. కొడుకు హోదా చూసుకుని మురిసిపోయారు. వాళ్ళిద్దరూ కారు బంగళా, ఫోను, నౌకర్లు, కాలు క్రింద పెడితే చాలు డ్రైవర్, ''కారు తియ్యమంటారా'' అన్నాడు.

''చేసే చెయ్యి, తిరిగే కాలు. పొలంపన్లు చేసే అలవాటు, ఊరికే కూర్చోలేక పోతున్నారు. అలాగని కొడుకుని వదిలిపెట్టలేరు. ఇక ఉండబట్టలేక వంటవాడి వంట తినలేక వంట పన్లోకి దిగింది మీనాక్షమ్మ.

• • •

వేణూకి ఒక్క నిమిషం తీరిక దొరకటంలేదు. నెలలో పదిహేను రోజులు విదేశాల ప్రయాణం. ఢిల్లీలో ఉంటే కాన్ఫరెన్సులు, మీటింగ్‌లు. నిమిషాలు కూడా వృధా చేయకూడని పరిస్థితులు. కంపెనీలో పూర్తిగా ఒక వింగ్ వేణుక్రింద పని చేస్తుంది. చూస్తుండగానే కంపెనీలో ప్రముఖుడయ్యాడు.

ఇప్పుడు వేణు ప్రయాణాలన్నీ కార్లు, విమానాలే. చివరికి వేణుకి, విమాన ప్రయాణ సమయం కూడా 'ఇంతసేపా' అనిపిస్తుంది.

తాను కోరుకున్న కోరిక చివరికి జీవితంలో ఒక భాగమై ముడిపడిపోయింది. చిన్ననాటి జ్ఞాపకాలు వచ్చినపుడు మాత్రం చిన్నగా నవ్వుకుంటాడు వేణు.

'చిన్ననాటి స్వప్నసౌధమే, జీవిత లక్ష్యంగా మారి నేటి భవిష్యత్తుకు పూలబాట వేసింది.'

★

